



గ్రామాల అభివృద్ధిపై దృష్టిసారించాలి

- అధికారులు వినకుంటే మా దృష్టికి తీసుకురండి
- ఉమ్మడి మెదక్ నేతలతో టీపీసీసీ అధ్యక్షుడు, మంత్రుల సమీక్ష

7

రంజాన్ వేళలు

బుధవారం ఇఫ్తార్: సాయంత్రం 6.31
గురువారం సహర్: ఉదయం 5.04

గ్రూప్-2 ఫలితాల్లో

'ఖేడ్' వాసుల సత్తా

ఉజలంపాడ్‌వాసికి 3వ ర్యాంకు

మంగల్‌పేట యువకుడికి 28వ ర్యాంకు



మనోహర్‌రావు



రాజ్‌కుమార్

నారాయణఖేడ్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం వెలువడిన గ్రూప్-2 ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ డివిజన్‌వాసులు సత్తాచాటారు. సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్ గ్రామానికి చెందిన బి.మనోహర్‌రావు జోనల్ స్థాయిలో మొదటి ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. నారాయణఖేడ్‌లో డిగ్రీ వరకు చదువుకున్న ఆయన హైదరాబాద్‌లోని వీవీ కళాశాలలో 2012లో ఎకనామిక్స్‌లో పీజీ పూర్తిచేశారు. అనంతరం బీఈడీ పూర్తిచేసి వరుసగా టీజీటీ, పీజీటీ ఉద్యోగాలు సాధించినా కొద్ది రోజులకే వదిలేసి గ్రూప్-2లో డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం సాధించారు. వికారాబాద్ జిల్లాలో కొద్దిరోజులు పనిచేసిన అనంతరం స్కూల్ అసిస్టెంట్, జేఎల్‌గా రావడంతో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగంలో చేరి ప్రస్తుతం పనిచేస్తున్నారు. రాష్ట్రస్థాయి ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా మరోసారి గ్రూప్-2 పరీక్ష (హాల్‌టికెట్ నంబరు2284609202) రాసి జోనల్ స్థాయిలో మొదటి ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు దక్కించుకున్నారు. దీనికితోడు సోమవారం ప్రకటించిన గ్రూప్-1 పరీక్ష ఫలితాల్లో ఆయన రాష్ట్ర స్థాయిలో 430 మార్కులు (ఇంకా ర్యాంకులు ప్రకటించలేదు) సాధించారు. అలాగే, నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేటకు చెందిన రాజ్‌కుమార్ (హాల్‌టికెట్ నంబరు 2285205025) రాష్ట్రస్థాయిలో ఓపెన్ కేటగిరిలో 168వ ర్యాంకు, జోనల్ స్థాయిలో 28వ ర్యాంకు సాధించి సత్తాచాటారు. 600 మార్కులకు గాను 385 మార్కులు సాధించారు. ఆయన గతేడాది నవంబరులో గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపికై వాణిజ్య పన్నుల విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.



7

వేడుకగా యువజనోత్సవాలు



కిష్టాపూర్ శివారులో ఇసుక ఫిల్టర్

'హల్దీ' జల్లెడ



కిష్టాపూర్ శివారులో హల్దీవాగు ఒడ్డున నిర్మించిన ఇసుక ఫిల్టర్

వాగు పొడవునా ఇసుక ఫిల్టర్లు

- కాళేశ్వరం నీరు వదలడంతో అక్రమార్కులకు పండుగ
- ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల కొద్దీ ఇసుక తయారీ
- కలిసొస్తున్న ఇసుక కొరత.. కాసులు కురిపిస్తున్న దందా
- అధికారుల అండదండలున్నాయని చెప్పుకుంటున్న నిర్వాహకులు

తూప్రాన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పొలాలకు సాగు నీరందించేందుకు విడుదల చేసిన కాళేశ్వరం నీరు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నది. హల్దీవాగు నిండుగా ప్రవహిస్తుండటంతో పుట్టగొడుగుల్లో ఇసుక ఫిల్టర్లు పుట్టుకొచ్చాయి. రియల్‌ఎస్టేట్, నిర్మాణ రంగాలు జోరుగా సాగుతుండటంతో జిల్లాలో ఇసుకకు విపరీతంగా డిమాండ్ ఉంది. స్థానికంగా ఇసుక లభ్యత తక్కువగా ఉండటంతో కాళేశ్వరం, భద్రాచలం నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఈ ఇసుకకు ధర ఎక్కువగా ఉంటుంది. డిమాండ్‌కు సరిపడినంత సరఫరా ఉండటం లేదు. ఇటీవల హైడ్రా దాడులతో కాళేశ్వరం, భద్రాచలం నుంచి ఇసుక రవాణా తగ్గింది. దీంతో ఫిల్టర్ ఇసుకను తయారుచేసి యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. తూప్రాన్ మండలంలో హల్దీవాగు పరీవాహక ప్రాంతంలో పెద్దసంఖ్యలో ఇసుక ఫిల్టర్లు వెలిశాయి.

కాళేశ్వరం నీటితో ఇసుక తయారీ

ఇటీవల పంటల కోసం కాళేశ్వరం నీటిని హల్దీవాగులోకి వదిలారు. నీళ్ల సంవృద్ధిగా ఉండటం అక్రమార్కులకు పండుగలా మారింది. తూప్రాన్ మండలం కిష్టాపూర్, యావాపూర్ శివారులో హల్దీవాగు పొడవునా ఇసుక ఫిల్టర్లు నిర్వహిస్తున్నారు. గుండ్రెడ్డిపల్లి, గౌడిగూడెం శివారులోని వాగుపైనా ఫిల్టర్లు ఏర్పాటు చేశారు. నీరు పుష్కలంగా ప్రవహిస్తుండటంతో వాగు పక్కనే ఫిల్టర్లు ఏర్పాటు చేసి మట్టిని తవ్వి, వాగు నీళ్లతో కడిగి ఇసుకను తయారు చేస్తున్నారు. రాత్రంతా ఇసుక తయారుచేసి తెల్లవారే సరికి తరలిస్తున్నారు. మట్టిని తవ్వడం కోసం ఎక్స్‌కవేటర్లు, రవాణా కోసం టిప్పర్లు, ట్రాక్టర్లు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు

మండలంలో పదుల సంఖ్యలో ఇసుక ఫిల్టర్లు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కట్టడి చేయాల్సి రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. అందరికీ తెలిసే ఈ దందా కొనసాగుతున్నా కన్నెత్తి కూడా చూడటంలేదు. దీంతో అక్రమ ఫిల్టర్ల నిర్వహణ మూడు పూవులు.. ఆరు కాయలుగా కొనసాగుతోంది.



ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

తెలిసినా స్పందించడం లేదు



హల్దీవాగు పక్కనే ఇసుక ఫిల్టర్లు నిర్వహిస్తునా అధికారులు పట్టించుకోవడంలేదు. రైతుల కోసం నీటిని విడుదల చేస్తే ఇసుక ఫిల్టర్ల నిర్వాహకులు కొల్లగొడుతున్నారు. చివరి ఆయకట్టు రైతులకు నీరు అందడంలేదు. పదుల సంఖ్యలో ఫిల్టర్లు ఏర్పాటు చేసినా అధికారులు కన్నెత్తి చూడటంలేదు. అధికారులకు మామూళ్లు ఇచ్చి ఫిల్టర్లు నడిపిస్తున్నట్లు నిర్వాహకులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు.

- మామిండ్ల అనిల్‌కుమార్, తూప్రాన్

మా దృష్టికి రాలేదు

తూప్రాన్ మండలంలో ఇసుక ఫిల్టర్లు నిర్వహిస్తున్న విషయం మా దృష్టికిరాలేదు. ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. ఫిల్టర్లు ఎక్కడ నడుస్తున్నాయో చెప్తే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో దాడులు చేసి అరికడతాం.

-విజయలక్ష్మి, తహసీల్దార్

రెవెన్యూ అధికారులదే బాధ్యత

ఇసుక ఫిల్టర్ల వ్యవహారం రెవెన్యూ అధికారులే చూస్తున్నారు హల్దీవాగు పక్కనే ఫిల్టర్లు ఏర్పాటు చేసిన విషయం తెలియదు. రెవెన్యూ అధికారులే చూసుకోవాలి.

-అనురాధ, ఇరిగేషన్ ఏఈ

'కల్యాణలక్ష్మి'పై

రాజకీయ రగడ

- మంత్రి చేతుల మీదుగానే అందజేయాలని అధికార పార్టీ నాయకుల పట్టు
- ఎన్నాళ్లు వేచిచూడాలని ఎమ్మెల్యే మండిపాటు
- డివిజన్‌లో పంపిణీకి సిద్ధంగా 513 చెక్కులు

నర్సాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డల పెళ్లిలకు ప్రభుత్వం అందించే కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి నర్సాపూర్ డివిజన్‌లో రాజకీయ గ్రహణం పట్టింది. వందల సంఖ్యలో చెక్కులు సిద్ధంగా ఉన్నా లబ్ధిదారులకు అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. గతంలో కల్యాణలక్ష్మి చెక్కులను ఎప్పటికప్పుడు స్థానిక ఎమ్మెల్యే అందించేవారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, నర్సాపూర్‌లో బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే గెలుపొందడంతో అధికారిక కార్యక్రమాలపై కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే సునీతరెడ్డి మధ్య రాజకీయ రగడ కొనసాగుతున్నది. ప్రొటోకాల్ వివాదం అధికారులకు ఇబ్బందికరంగా మారింది. కల్యాణలక్ష్మి చెక్కులను గతంలో మాదిరిగా ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయాలని సునీతా రెడ్డి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. కాగా, జిల్లా మంత్రి దామోదర్‌రాజనర్సింహ లేదా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేసి చెక్కులను పంపిణీ చేయాలని అధికార పార్టీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. దీంతో డివిజన్‌లో మంజూరైన 513 చెక్కుల పంపిణీకి నిలిచిపోయింది. నర్సాపూర్ మండలంలో 125, శివ్వంపేటలో 108, కౌల్చారంలో 103, కౌడిపల్లిలో 121, చిలప్‌చెడ్‌లో 56 చెక్కులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఈ పంచాయతీ తెగేదెప్పుడు.. చెక్కులు ఇచ్చేదెప్పుడు అని లబ్ధిదారులు దురుచూస్తున్నారు.

మున్సిపాలిటీల పరిధిలోకి

పంచాయతీ కార్యదర్శులు

25 మందికి అవకాశం

రామచంద్రాపురం టౌన్ మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఇటీవల కొత్తగా ఏర్పడిన ఆరు మున్సిపాలిటీల్లో విలీనమయిన గ్రామ పంచాయతీల కార్యదర్శులకు పురపాలికల్లో స్థాయికి తగ్గట్టుగా పనిచేయడానికి అవకాశం కల్పిస్తూ మంగళవారం రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ అండ్ కమిషనర్ శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. తెల్లాపూర్ పరిధిలో ముత్తంగి, పోచారం, కర్ధనూరు, పాటి, ఘన్‌పూర్, అమీన్‌పూర్ పరిధి కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, సుల్తాన్‌పూర్, దాయెర, ఐలాపూర్, ఐలాపూర్ తాండా, ఇస్నాపూర్ పరిధి ఇస్నాపూర్, చిట్కుల్, పాశమైలారం, గడ్డపోతారం పరిధి గడ్డపోతారం, ఖాజిపల్లి, మాదారం, వావిలాల, లక్ష్మీపతిగూడెం.. గుమ్మడిదల పరిధిలో గుమ్మడిదల, అన్నారం, బొంతపల్లి, వీరన్నగూడెం, దోమడుగు, కోహీర్ మున్సిపల్ పరిధిలో కోహీర్ గ్రామాలు పురపాలికల్లో విలీనమయ్యాయి. ఈ గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను విద్యార్హతను బట్టి పోస్టింగ్‌లు ఇస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం పొందుతున్న జీతభత్యాల వివరాలు, జోన్ పరిధి తెలుపుతూ మున్సిపాలిటీలో విలీనానికి సిద్ధంగా ఉన్నారా అనే విషయం స్పష్టం చేయాలని కోరారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మాతాశిశు మరణాలు లేని జిల్లాగా నిలపాలి

ఏఎన్‌ఎంల సమీక్షలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాను మాతా, శిశు మరణాలు లేని జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఏఎన్‌ఎంలను ఆదేశించారు. కలెక్టర్‌లో మంగళవారం ఆయన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఏఎన్‌ఎంలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో గర్భిణులందరి వివరాలు పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నమోదు చేయించాలని సూచించారు. క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించిన మందులు, పౌష్టికాహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రక్తహీనత, రక్తపోటు, మధుమేహం, సీ-సెక్షన్, కామెర్లు, క్షయ, గర్భస్థ శిశువు ఎదుగుదల తదితరాలపై అవగాహన కల్పించేందుకు జాతీయ ఆరోగ్యమిషన్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. గత మూడు నెలల్లో జిల్లాలో మాత, శిశు మరణాల నియంత్రణకు కృషిచేసిన వైద్యాధికారులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్ఞానేశ్వర్, నవీన్, సృజన, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి

పాపన్నపేట: జిల్లాలోని నీటివనరులను ఆయకట్టు రైతులు సమర్థంగా వినియోగించుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. పాపన్నపేట మండలంలో ఘనపురం ఆనకట్ట చివరి ఆయకట్టును ఆయన పరిశీలించారు. బోర్ల కింద సాగవుతున్న వరి పొలాలను సందర్శించారు. రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో పంటలకు నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయనవెంట ఇరిగేషన్ ఏఈ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



7

గోవర్ధనగిరి.. మోదుగుపూల సిరి

సహజ రంగులతో హోలీ.. ఆ ఊరి ఆనవాయితీ

ఆలయ భూములు అన్యాక్రాంతం

- యథేచ్ఛగా ఆక్రమించి నిర్మాణాలు
- ఇంద్రకరణలో క్రికెట్ గ్రౌండ్, సెల్‌టవర్, దుకాణాలు..
- కందిలో డెయిరీఫాం షెడ్డు నిర్మాణం

కంది, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న కంది మండలంలో ఆలయ భూములు కబ్జాకు గురవుతున్నాయి. కంది, ఇంద్రకరణ్ గ్రామాల్లోని ఆలయ భూముల్లో దుకాణాలు, పశువుల కొట్టాలు, సెల్‌ఫోన్ టవర్లు, క్రికెట్ నెట్లు, డెయిరీఫాం షెడ్లు నిర్మిస్తున్నారు. ఇంద్రకరణ్ గ్రామంలోని అంజనేయ స్వామి ఆలయానికి 110, 112 సర్వే నంబర్లలో 11 ఎకరాలు ఒక చోట, 3 ఎకరాలు మరోచోట భూములు ఉన్నాయి. 11 ఎకరాల్లో ప్రస్తుతం క్రికెట్‌గ్రౌండ్, ప్రాక్టీస్ కోసం నెట్‌లు నిర్మించి అద్దెకిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ భూమిలో దేవాదాయ భూమి అని బోర్డు ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. ప్రతీరోజు సాయంత్రమైందంటే ఇక్కడ తాగుబోతులు గుంపులుగా చేరి మద్యం తాగి హంగామా చేస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు.

వ్యవసాయ భూమిలో షెడ్డు

కందిలోని సర్వే నంబరు 714, 715, 716, 717, 718లో పాండు రంగ స్వామి ఆలయానికి 54 ఎకరాల భూమి ఉన్నది. ఇందులో కంది-శంకర్‌పల్లి హైవే పక్కనే ఉన్న 714, 715 సర్వే నంబర్‌లోని భూమిలో 400 గజాల్లో డెయిరీఫాం కోసం షెడ్డు వేయడం కలకలం రేపుతోంది. ఆలయ భూముల్లో వ్యవసాయం మాత్రమే చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ పట్టించుకోకుండా అధికారుల సహకారంతో షెడ్డు నిర్మిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలిసినా దేవాదాయశాఖ, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.





ఇంద్రకరణ్‌లో హనుమాన్ ఆలయభూమిలో దుకాణం, క్రికెట్ నెట్



కంది పాండురంగస్వామి ఆలయ భూమిలో వెలసిన షెడ్డు

ఒక్కసారి కూడా పూజలు చేయలేదు



గ్రామంలో అంజనేయస్వామి ఆలయానికి చెందిన 14 ఎకరాల భూమి దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్నది. ఇందులో 11 ఎకరాలను వేలం పాట ద్వారా గ్రామస్థులకు మూడు సంవత్సరాలకు లీజుకి ఇచ్చారు. దీనికి రూ.1,75,000 ఆదాయం వచ్చినా దేవాదాయశాఖ అధికారులు ఒక్కసారీ ఆలయంలో పూజలు జరిపించలేదు. లీజుకు తీసుకున్న భూమిలో వ్యవసాయం చేయకుండా క్రికెట్‌గ్రౌండ్ నిర్మించి కిరాయికి ఇస్తున్నారు. మరో మూడెరాల్లో సెల్‌టవర్, వెల్డింగ్ షాపులు, డబ్బాలు మట్టిరోడ్లు, పశువుల షెడ్లు నిర్మించారు.

-వెంకటరెడ్డి, ఇంద్రకరణ్

రూ. 50 కోట్ల భూములకు ఎసరు



ఆలయ భూముల్లో షెడ్లు, క్రికెట్ గ్రౌండ్లు నిర్మించడం చూస్తుంటే భూముల్ని అమ్ముకుంటారేమోనని అనుమానం కలుగుతున్నది. ఈ విషయం తెలిసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. రూ. 50 కోట్లు విలువచేసే అంజనేయస్వామి ఆలయ భూమిని కాపాడటానికి ఉన్నతాధికారులు పూనుకోవాలి.

-పొన్నయ్యగౌడ్, ఇంద్రకరణ్

విచారణ జరిపిస్తాం

ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలపై ఈవోతో విచారణ జరిపిస్తాం. మా నోటీసులో లేని నిర్మాణాలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

-దేవాదాయశాఖ జిల్లా అధికారి

అభివృద్ధి పనులన్నీ వేగంగా పూర్తి చేయాలి

● సమీక్షలో మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు


సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మెదక్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు అధికారులకు సూచించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి ఎమ్మెల్యే పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, మిషన్ భగీరథ, విద్యం, వైద్యం, విద్యుత్, మున్సిపల్ తదితరశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఏడుపాయల పుణ్యక్షేత్రంలో శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆలయం వద్ద శాశ్వతంగా ఉండేలా నిర్మాణ పనులు చేపట్టాలని, పంచాయతీరాజ్, అటవీశాఖ అధికారులు పరస్పర సహకారంతో ముందుకెళ్లాలని సూచించారు. ఈ విషయంలో ఏదైనా సమస్య ఉంటే కలెక్టర్‌తోపాటు తన దృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, భవనాల శాఖ చేపట్టనున్న పెండింగ్ పనుల్లో వేగం చేయాలన్నారు. చెరువుల సుందరీకరణకు అవసరమైన చర్యలు తీసుకొని, అందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టలన్నారు. విద్యుత్ అంతరాయం, లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ కళాశాలల్లో అవసరమైన సదుపాయాల కల్పన కృషిచేస్తానని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రిబుల్ ఆర్‌పై అధికారులతో ఆర్డీవో సమీక్ష

నర్సాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ డివిజన్‌లో ట్రిబుల్ ఆర్‌పై భూ సేకరణ అంశంతో పాటు ఇతర అంశాలను ఆర్డీవో మహిపాల్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షలో నర్సాపూర్, శివ్వంపేట మండలాల రెవెన్యూ అధికారులతో పాటు అటవీశాఖ, జాతీయ రహదారి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లో 85 ఎకరాల మేరకు అటవీ భూమి ఉందని ఆ విషయమై కూడా చర్చించినట్లు ఆర్డీవో తెలిపారు. త్వరలోనే భూసేకరణ చేసిన రైతులకు పరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వనదుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్సీ

పాపన్నపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాతను ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో చంద్రశేఖర్, అర్చకులు స్వాగతం పలికారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మర్యాదలతో సత్కరించారు.

చైతన్యంతోనే మహిళా స్వావలంభన

● మహిళా దినోత్సవంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి


మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత తదితరులు

పటాన్‌చెరు/హత్నూర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : చైతన్యంతోనే మహిళా స్వావలంభన సాధ్యమవుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మెట్టు రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో పట్టణంలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. హక్కుల సాధన కోసం నారీశక్తి ఐక్యంగా ముందుకు కదలాలన్నారు. మహిళల స్వయం ఉపాధి కోసం కార్పొరేటర్ దంపతులు చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, మాజీ శాసనమండలి ప్రొటెం స్పీకర్ భూపాల్‌రెడ్డి సతీమణి గీతాభూపాల్‌రెడ్డి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యురాలు సుమిత్రాఆనంద్, కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, సింధూఆదర్శరెడ్డి, మాజీ కార్పొరేటర్ యాదవ్ పాల్గొన్నారు. మండల కేంద్రమైన హత్నూర ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుతున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రోజారమణి, సీహెచ్‌వో పురుషోత్తం, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.


సుహాసినిరెడ్డిని సన్మానిస్తున్న వివిధశాఖల జిల్లా అధికారులు, టీఎన్జీవో జిల్లా బృందం

సమానత్వం ఇంటి నుంచే మొదలవ్వాలి

మెదక్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సమానత్వం ఇంటి నుంచే మొదలవ్వాలని, అప్పుడే మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన మహిళా దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించేందుకు తమ ప్రతిభను, సత్తాను చాటుకోవాలని సూచించారు. అనంతరం జిల్లాలోని మహిళా ఉద్యోగులను శాలువా, మెమొంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు శశికళ, నీలిమ, మెప్మా పీడీ ఇందిరా, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, జిల్లాలోని మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్నిరంగాల్లో ముందుండాలి

నారాయణఖేడ్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని మహిళా సాధికారిత కేంద్రం స్పెషల్ ఆఫీసర్ నర్సింలు అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ సరస్వతీ శిశుమందిర్‌లో 'బేటి బచావో, బేటి పడావో' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులు, బాధ్యతలు, విద్యా హక్కు చట్టం గురించి వివరించడమే కాకుండా మహిళలు, బాలురు ఏమైనా సమస్యలు ఉంటే 100,102,104, 181, 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భూమయ్య, స్కోప్ ఎన్‌జీవో కౌన్సిలర్ సవిత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బేటి బచావో-బేటి పడావోపై అవగాహన కల్పిస్తున్న మహిళా సాధికారిత కేంద్రం స్పెషల్ ఆఫీసర్ నర్సింలు

రెండు వరుసల రోడ్డుకు నిధులు కేటాయించాలి


రామాయిపల్లిలో సంతకాల సేకరణ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

వెల్దుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి నుంచి పిల్లికొట్టాల వరకు రెండు వరుసల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ కోరారు. మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి గౌరి ఆధ్వర్యంలో మండల పరిధిలోని రామాయిపల్లి, బండపోసన్‌పల్లి, శెట్టిపల్లి గ్రామాల్లో రెండు వరుసల రోడ్డు నిర్మాణం చేయాలని సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెల్దుర్తి మండల పరిధిలోని ఆయా గ్రామాల మీదుగా పిల్లికొట్టాల వరకు ఒకే వరుస రోడ్డు ఉండడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతూ ప్రమాదాల బారినపడుతున్నారని, రెండు వరుసల రోడ్డు నిర్మాణానికి కావాల్సిన నిధులు కేటాయించాలన్నారు. గ్రామాల్లో చేపట్టిన సంతకాల సేకరణ పత్రాలను కలెక్టర్‌కు అందజేస్తామని వారు తెలిపారు.

శివనామస్మరణతో మార్మోగిన మల్లన్న ఆలయం

కంగ్టి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కంగ్టిలోని మల్లన్న ఆలయం మంగళవారం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన అర్చకుడు మహాలింగ్ స్వామి ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. అంతకుముందు స్వామీజీని భక్తులు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. మల్లన్న ఆలయ పూజారి శ్రీకాంత్‌స్వామి ఆధ్వర్యంలో కొనసాగిన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

సామూహిక కుంకుమార్చనలు

పెద్దశంకరంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలోని ప్రియాంక కాలనీలో నిర్మించిన పోచమ్మ ఆలయంలో మంగళవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. వేదబ్రాహ్మణుల మంత్రోశ్ఛరణల మధ్య అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలతో పాటు కుంకుమార్చనలు చేశారు. భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు.

ముగిసిన మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

పుల్‌కల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంతూర్ గ్రామంలో కొనసాగుతున్న మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. 4న ప్రారంభమైన ఉత్సవాలు 8 రోజుల పాటు కనుల పండువలా సాగాయి. 11న కడుపలు కడుగుట కార్యక్రమంతో ఉత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు.

గడ్డపోతారంలో ఎల్లమ్మ జాతర

జిన్నారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారంలో ఎల్లమ్మ ఆలయ జాతర ఘనంగా జరిగింది. మంగళవారం భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. జాతరలో వందల సంఖ్యలో భక్తులు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

కొత్తగా షాపు పెడుతున్నామని..

● ప్లైవుడ్ తీసుకొని ముగ్గురు పరారీ

● రూ.1.50 లక్షల విలువ, ఆలస్యంగా వెలుగులోకి

తూప్రాన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా దుకాణం ఏర్పాటు చేస్తున్నాం. అందులో ఫర్నిచర్ చేయించేందుకు మెటీరియల్ కావాలని లక్షన్నర విలువైన సామగ్రి తీసుకున్నారు. ఓ షెట్టర్‌లో వేసినట్లు నమ్మకం కలిగించారు. రెండురోజుల్లో డబ్బులిస్తామని చెప్పి ఫర్నిచర్ తీసుకుని రాత్రికిరాత్రే ఉడాయించారు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తూప్రాన్ పట్టణంలో పూసరాం చౌదరి కొన్నేళ్లుగా గీతా ట్రేడర్స్ పేరుతో ప్లైవుడ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇతడి షాపు వద్దకు గతనెల 27న ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి కొత్తగా అక్షయసాయి ఆస్పత్రి ఎదురుగా షాపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రెండురోజుల్లో డబ్బులు ఇస్తామని రూ.1.50 లక్షల విలువైన ప్లైవుడ్ షీట్స్, ఫెవికోల్, డెకొలమ్ షీట్స్ తీసుకుని షాపులో దించుకున్నారు. 28న డబ్బులు ఇస్తామని నమ్మించారు. 28న డబ్బులు ఇవ్వకపోగా, దుకాణం వద్దకు వెళ్లగా కొనుగోలు చేసిన ప్లైవుడ్‌తో పరారీ అయ్యారు వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ట్యాంకర్ పైనుంచి వెళ్లి వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

రామచంద్రాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వాటర్ ట్యాంకర్(లారీ) కింద పడుకున్న గుర్తు తెలియని వ్యక్తి పైనుంచి లారీ పోవడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. తెల్లాపూర్‌లోని ఎలియన్స్ ఫేస్ స్టేషన్ వద్ద పార్కుచేసిన వాటర్ ట్యాంకర్ కింద ఓ గుర్తు తెలియని వ్యక్తి(45-50) పడుకున్నాడు. ట్యాంకర్ డ్రైవర్ గమనించకుండా లారీని ముందుకు నడపడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు కొల్లూరు పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య


వట్టేపు స్వామి (ఫైల్)

చేగుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రావడం లేదని భర్త మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ అహ్మద్ మొయినుద్దీన్ వివరాల ప్రకారం.. నార్సింగి పట్టణానికి చెందిన వట్టేపు స్వామి(32)కి చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన శిరీషతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం కలగలేదు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. గతంలో పెద్దలు సమక్షంలో పంచాయితీ నిర్వహించి శిరీషను అత్తవారింటికి తీసుకువచ్చారు. ఇటీవల అన్న మృతిచెందాడని వడియారం పుట్టింటికి వెళ్లిన శిరీష 20 రోజులైనా రాలేదు. దీంతో మనస్తాపానికి గురైన స్వామి ఆత్మహత్య చేసుకుంటున్నానని తమ్ముడు శ్రీకాంత్‌కు ఫోన్‌చేసి చెప్పాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు నార్సింగి మండలం వల్లూరు అటవీ ప్రాంతానికి వెళ్లి చూసేసరికి స్వామి చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే నార్సింగిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

యువకుడు అదృశ్యం


కత్తి ప్రభాకర్ (ఫైల్)

మనోహరాబాద్ మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలో పనిచేసే యువకుడు అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం పోతారం గ్రామానికి చెందిన కత్తి ప్రభాకర్(30) సూపర్ సీడ్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి 9 గంటలకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం భార్య కత్తి కోమలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాగునీరు విడుదల చేయాలి: రైతులు

హవేళిఘణపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జక్కన్నపేట పోచమ్మరాల్ గ్రామాల్లో మహబూబ్ కెనాల్ నీరు అందక ఆయకట్టు చివరి గ్రామాల శివార్లలో వేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయి. ఈ గ్రామ శివారుల్లోని సుమారు 50 ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఉన్నది. అధికారులు స్పందించి కెనాల్ ద్వారా వరి పంటకు సాగునీరు అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కరెంట్ సరఫరాలో ఇబ్బందులున్నాయా?

రైతులతో మాట్లాడిన విద్యుత్ అధికారి



రైతులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ డైరెక్టర్ నందకుమార్

కొండాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పంటపొలాలకు అందిస్తున్న త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో ఏమైనా ఇబ్బందులున్నాయా అని విద్యుత్ శాఖ డైరెక్టర్ నందకుమార్ ఆరా తీశారు. మంగళవారం ఆయన మండలంలోని తేర్పోల్‌ను సందర్శించారు. నేరుగా పంట పొలాల వద్దకు వెళ్లి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఎలా ఉందని రైతులన అడిగి తెలుసుకున్నారు. సరఫరాలో అంతరాయం వంటి సమస్యలున్నాయా? నిర్ణీత సమయానికి సరఫరా జరుగుతుందా అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేస్తున్నామని, వ్యవసాయం పేరుతో అనుమతి లేని విద్యుత్‌ను ఉపయేగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చారించారు. ఆయన వెంట జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనాథ్, డీఈ రవీందర్‌రెడ్డి, ఏడీఏ వీరారెడ్డి, మండల ఏఈ సిద్దిరాజ్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్ జోక్యంతో కార్మికులకు న్యాయం



పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి జోక్యంతో కార్మికులకు న్యాయం జరిగింది. జిల్లాలోని సదాశివపేట పరిధిలోని ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో కొంత కాలంగా ట్రైనీ కార్మికులు, యాజమన్యానికి మధ్య వివాదం ఉంది. దీంతో తమకు న్యాయం చేయాలని ట్రైనీ కార్మికులు కలెక్టర్‌ను సంప్రదించారు. కార్మికులు విజ్ఞప్తి మేరకు ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ ప్రతినిధులతో కలెక్టర్ మంగళవారం సమావేశమై చర్చించారు. దీంతో ట్రైనీ కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించాలని, అర్హతలను బట్టి కార్మికులకు రూ. 18 వేల నుంచి రూ.24 వేలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. కాంట్రాక్టు కార్మికులుగా పది సంవత్సరాలు పనిచేసిన కార్మికులకు గ్రాట్యూటీ చట్టం ప్రకారం గ్రాట్యూటీ డబ్బులు చెల్లించాలని కలెక్టర్ క్రాంతి పరిశ్రమ యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ చర్చల్లో డీసీఎల్ రవీందర్‌రెడ్డి, కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యలు పెద్ద వ్యాపారాలు చేయొచ్చు..



మహిళా సంఘాలతో త్రిపుర రాష్ట్ర సభ్యులు

దౌల్తాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళా సమాఖ్యల ద్వారా పెద్ద వ్యాపారాలు చేయవచ్చునని త్రిపుర రాష్ట్ర బృందం సూచించింది. మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో మంగళవారం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశానికి త్రిపుర రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది సభ్యుల బృందం హాజరైంది. ఈ సందర్భంగా వారు మహిళల ఆధ్వర్యంలో నిరవహించిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నిర్వహణ, వాటి వల్ల రైతులకు లాభాలు వంటి అంశాలను తెలుసుకున్నారు. మహిళా సంఘాలకు రుణాలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీ సీఓ కనకరాజు, గజ్వేల్ ఎఫ్‌పీ సీఓ రవీంద్రచారి, అకౌంటెట్లు మహేష్, దేవశీల, ఛైర్‌పర్సన్ కనకలక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, కార్యదర్శి లావణ్య, బోర్డు డైరెక్టర్లు హజరయ్యారు.

రామయ్యకు గోటి తలంబ్రాలు



గోటితో తలంబ్రాలు తయారు చేస్తున్న భక్తులు

సిద్దిపేట కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా భద్రాద్రి రామయ్య కల్యాణానికి శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో గోటి తలంబ్రాలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రామకోటి రామరాజు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ ఎంతోమంది భక్తులతో గోటితో ఒలిచిన తలంబ్రాలను తయారు చేయిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం సిద్దిపేట పట్టణంలోని గణేష్ నగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో కోటి తలంబ్రాల దీక్ష ప్రారంభించారు. దాదాపు 200 మంది భక్తులు పాల్గొని రామనామ స్మరణ చేస్తూ గోటితో వడ్లను ఓలిచి రామకోటి రామరాజుకి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు పెందోటి శ్రీనివాస్, చంద్రమౌళి, రవి, వెంకటేష్, అర్చకులు వెంకటరమణచారి, సీతారామాంజనేయ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల తయారీపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కృష్ణ చైతన్య

సిద్దిపేట కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ప్రాజెక్టుల తయారీ, పరిశోధన మెలకువలు అనే అంశంపై డిగ్రీ, పీజీ ఫైనల్ సెమిస్టర్ విద్యార్థులకు ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌నకు దాదాపు 400 మంది విద్యార్థులు హజరయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ డిపార్ట్‌మెంట్ డీన్, ప్రొఫెసర్ కృష్ణ చైతన్య ముఖ్య వక్తగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు అందించారు. నిపుణులైన అధ్యాపకుల పర్యవేక్షణలో నాణ్యమైన ప్రాజెక్టులు రావడం వల్ల తర్వాత కాలంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల విషయంలో ఉపయోగపడతాయని గణాంక, సాంకేతిక సాధనాల విషయంలో మంచి నైపుణ్యం పొందవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. సునీత మాట్లాడుతూ విద్యార్థులు సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని పరిశోధన మెళుకువలతో మంచి ప్రాజెక్టులను రూపొందించాలన్నారు. కార్యశాల కన్వీనర్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ గోపాల సుదర్శనం, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. అయోధ్య రెడ్డి, సులేమాన్ అహ్మద్, డాక్టర్ ఉమామహేశ్వరి, గురుచరణ్ దాసు, డాక్టర్ టి శ్రీనివాస్‌తోపాటు వాణిజ్య వ్యాపార శాస్త్ర విభాగాల అధ్యాపకులు, కళాశాల ఆచార్యులు పాల్గొన్నారు.

గోవర్ధనగిరి..

మోదుగుపూల సిరి

సహజసిద్ధ రంగులతో హోలీ

- వారం ముందే పూల సేకరణ
- అనాదిగా ఆ ఊరి ఆనవాయితీ



మోదుగు చెట్టు పూలను తెంపుతున్న గ్రామస్థులు



హుస్నాబాద్ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగ వచ్చిందంటే చిన్నారులను మొదలుకొని యువతీ, యువకులు, చిన్నా పెద్దా అనే తేడా లేకుండా రంగుల్లో మునిగి తేలుతారు. అయితే, చాలా మంది రసాయానాలతో తయారు చేసిన రంగులను చల్లుకుని సంబరాల్లో మునిగిపోతుంటారు. కానీ, ఆ గ్రామంలో మాత్రం రసాయన రంగులకు దూరంగా ప్రకృతి సిద్ధంగా లభించే మోదుగు పూలతో రంగులు తయారు చేసుకుని హోలీ సంబురాల్లో పాల్గొంటారు. అనాదిగా వస్తున్న ఈ ఆనవాయితీని నేటి తరం కూడా పాటిస్తోంది. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామస్థులు హోలీ పండుగకు వారం రోజుల ముందుగానే గ్రామశివారులో మోదుగు పూలను తెచ్చుకుని, వాటిని నాలుగు రోజుల పాటు నీటిలో నానబెడుతారు. ఆ పూలను ఉడకబెట్టి రంగు తీస్తారు. ఈ రంగును హోలీ రోజున ఒకరికొకరు చల్లుకుని సంబరాల్లో తేలి ఆడుతుంటారు. మోదుగపూలతో రంగులు తయారు చేయడమే కాకుండా ఉదయం పూట మోదుగపూలను తెంపుకుని అందులోని మకరందాన్ని సేవిస్తారు. దీంతో శరీరంపై ఉన్న ముడతలను నయం కావడమే కాకుండా, షుగర్ వ్యాధిని కంట్రోల్ చేసే శక్తి ఉందని చెబుతారు. తమ తాత ముత్తాల నుంచి సహసిద్ధంగా తయారు చేసిన మోదుగు పూల రంగులనే హోలీకి వాడుతున్నామని గ్రామస్థులు చెబుతున్నారు. వంపులు తిరిగి ఎర్రని రంగులో చిలక ముక్కు ఆకారాన్ని పోలి ఉన్న గోగుపూలతో మరెన్నో లాభాలు ఉన్నాయని ఆయుర్వేద వైద్యులు కూడా చెబుతారని పేర్కొన్నారు.



గ్రామ శివారు నుంచి రంగుల హోలీ కోసం మోదుగుపూలను తీసుకువస్తున్న గ్రామస్థులు

రసాయన రంగులకు దూరంగా..



మా గ్రామంలో రసాయన పదార్థాలతో తయారు చేసిన రంగులు వినియోగించం. మోదుగ పూలతో సొంతంగా రంగు తయారు చేసుకుంటాం. పండుగకు పది రోజుల ముందే పూలు తీసుకువచ్చి, నీటిలో నానబెడుతాం. తర్వాత ఉడకబెట్టి రంగు తీసి సీసాల్లో దాచుకుంటాం. హోలీ వేడుకల్లో సహజ సిద్ధమైన రంగులతో ఎంజాయ్ చేస్తాం.

-పాక సురేష్, గోవర్ధనగిరి

పెద్దల నుంచి వచ్చింది..



మా తాతముత్తాతల నుంచి ఇదే పద్ధతి పాటిస్తున్నారు. గ్రామ శివారులో మోదుగ చెట్టుకు పూసిన పూలను తెచ్చి రంగులు తయారు చేసుకుంటాం. హోలీ రోజు అదే రంగుతో ఆడుతాం. ఈ రంగు వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. ఊర్లో అందరూ మోదుగ పూల రంగులను తయారు చేసుకుంటారు.

-గొర్ల రాజు, గోవర్ధనగిరి

ముఖంపై ముడతలు పోతాయి..



మోదుగ పూల మకరందాన్ని తాగిగే ముఖంపై ముడతలు పోతాయి. మా ముత్తాతలు ఈ విషయం చెప్పారు. మేం ఇప్పటికీ పాటిస్తున్నాం. హోలీ పండుగకు మోదుగ పూలతో రంగులు తయారు చేసుకుని చల్లుకుంటాం. నాకు తెలిసినప్పటి నుంచీ హోలీకి ఇవే మా రంగులు.

-హన్మయ్య, గోవర్ధనగిరి

పొంగిపొర్లుతున్న ఘనపూర్ పెద్దవాగు

ఘనత మాదంటే మాదంటున్న.. కాంగ్రెస్, బీఆర్ఎస్

పోటాపోటీగా జలాభిషేకాలు.. గంగమ్మ పూజలు





గంగమ్మ పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కేసీఆర్.. హరీశ్ చిత్రపటాలకు జలాభిషేకం

నంగునూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రంగనాయక్‌సాగర్ ద్వారా మండలంలోని ఘనపూర్ పెద్దవాగు నిండి చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతుండటంతో ఆ ఘనత మాదంటే మాదని మంగళవారం ఇటు కాంగ్రెస్.. అటు బీఆర్ఎస్ పోటాపోటీగా పూజలు చేశారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావుల చలువ వల్లే రంగనాయక్‌సాగర్ కాలువల ద్వారా గోదావరి జలాలు మారుమూల గ్రామాలకు చేరుకుని భూగర్భ జలాలు పెరుగుతున్నాయని పేర్కొంటూ మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కర్రెడ్ల లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ బాల్నరసయ్య, విజేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వాగువద్ద కేసీఆర్, హరీష్‌రావుల చిత్రపటాలకు జలాభిషేకం చేశారు. టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తప్పేట శంకర్‌ల ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి ప్రత్యే క పూజ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కాళేశ్వరం నీళ్లు గ్రామాలకు రావని బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు.



వేడుకగా యువజనోత్సవాలు

మెదక్ అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన ఉత్సవాలు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వేడుకగా జరిగాయి. కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడా మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థులు రూపకల్పన చేసిన విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు చదువుతోపాటు కళలపై ఆసక్తి పెంచుకొని వాటిలోనూ రాణించాలన్నారు. యువతలోని ప్రతిభను వెలికి తీయడానికి యువజనోత్సహలు ఎంతో దోహదపడుతాయన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదుతోపాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, డీఎస్‌వో రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విజేతలు..

సైన్స్ ప్రదర్శన బృంద విభాగంలో ప్రథమస్థానం వైష్ణవి (ప్రభుత్వ డిగ్రీ కళాశాల నర్సాపూర్), వ్యక్తిగత విభాగంలో ప్రథమ గణేష్(జెడ్పీహెచ్ఎస్ లింగాయిపల్లి), రచయిత విభాగం ప్రథమ సారిక(జీడీసీ, మెదక్), యంగ్ ఆర్టిస్ట్ ప్రథమ సుష్మిత, ఫోటోగ్రఫీ ప్రథమ స్థానం(లావణ్య), వక్తృత్వ పోటీలో ప్రథమ సారికా(జీడీసీ, మెదక్), బృంద నృత్యంలో ప్రథమ నివేదిత (మెదక్)లు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

మహిళల జీవనోపాధి అభివృద్ధికి నాబార్డు కృషి

జహీరాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని, వారి జీవనోపాధి మెరుగుపడేందుకు నాబార్డు కృషిచేస్తుందని సంస్థ సీజీఎం ఉదయబాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని డీడీఎస్-కేవీకేలో మహిళాదినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాబార్డ్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. డీడీఎస్ మహిళాసంఘాల పనితీరును ఆయన అభినందించారు. కార్యక్రమంలో నాబార్డు అధికారులు, డీడీఎస్ అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి: ఎమ్మెల్సీ అంజిరెడ్డి



జహీరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని నాగదేవతాలయం వార్షికోత్సవం సందర్భంగా జహీరాబాద్‌కు వచ్చిన ఆయనను బీజేపీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి సంఘటితంగా కృషి చేద్దామన్నారు. తన విజయానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు. అందరికీ అందుబాటులో ఉంటూ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. నాగదేవతాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ పాల్గొని, మానసదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్‌జగన్, నాయకులు గొల్లబాస్కర్, శ్రీనివాస్‌గుప్త, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నాగదేవతాలయంలోవద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

అధికారులు వినకుంటే మా దృష్టికి తీసుకురండి

ఉమ్మడి మెదక్ నేతలతో టీపీసీసీ అధ్యక్షుడు, మంత్రుల సమీక్ష



సమీక్ష సమావేశంలో మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి కొండా సురేఖ

సిద్దిపేట టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలోని గ్రామాల అభివృద్ధిపై ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు దృష్టి సారించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి దామోదర్ రాజనర్సింహ, నాయకులు మైనంపల్లి హనుమంతరావు సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులతో వారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీని నమ్ముకొని పనిచేసిన నాయకులు, కార్యకర్తలకే నామినేటెడ్ పదవులు దక్కుతాయని చెప్పారు. త్వరలోనే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేవారు నామినేటెడ్ పదవుల కోసం పోటీ పడవద్దని సూచించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని గ్రామాల్లో అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేయనున్నారని తెలిపారు. ఉపాధి హామీ పథకం, రోడ్లు, ప్రభుత్వ పాఠశాలలు, తాగునీరు, ప్రజలకు మౌలిక సదుపాయాలపై తదితర వాటికి ఆ నిధులను ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో చేపట్టే ప్రతి అభివృద్ధి పనుల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. అధికారులు సహకరించకుండా తమ దృష్టికి తీసుకువస్తే.. అలాంటి అధికారులను బదిలీ చేస్తామని చెప్పారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని, తమ విద్వేశాలను పక్కన పెట్టాలని సూచించారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరైన పనిచేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధి పనులతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను గడపగడపకు వివరించాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి కట్టుగా పని చేయాలని ఈ సందర్భంగా సూచించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మాలాజగ్గారెడ్డి, ఇన్‌చార్జిలు రాజిరెడ్డి, పూజల హరికృష్ణ, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- సర్వీస్ రోడ్డుకు అడ్డంగా గొయ్యి
- అనునిత్యం ప్రమాదాలు
- పట్టించుకోని ఎన్‌హెచ్ఏ అధికారులు



చౌటకూర్‌లోకి వెళ్లే రోడ్డుకు అడ్డంగా మట్టి కుప్ప

పుల్‌కల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం చౌటకూర్ వద్ద జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పైకి వెళ్లేందుకు అవకాశం లేకుండా గొయ్యిని తవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని మురుగునీరు దిగువకు వెళ్లేందుకు రోడ్డు కింద ఉన్న పైప్‌ను తొలగించడంతో పెద్ద గుంత ఏర్పడింది. కొత్తగా మరో రెండు పైపులను అక్కడ వేయాల్సి ఉన్నప్పటికీ గొయ్యి తవ్వి వదిలేశారు. దీంతో సంగారెడ్డి నుంచి వచ్చే ప్రజలు గ్రామంలోకి రాకుండా ప్రమాదకరంగా మారింది. అలాగే గ్రామంలోని ప్రజలు 161వ నంబరు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పైకి వెళ్లాలన్న అవస్థలు పడుతున్నారు. ఆరునెలల క్రితం ఈ రోడ్డును తవ్వడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూ అనేకమంది క్షతగాత్రులవుతున్నారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఇష్టానుసారంగా రోడ్డును తవ్వి పైపులు వేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును తవ్వడంతో కార్లు, ద్విచక్ర వాహనాలతో పాటుగా వ్యవసాయ పొలాలకు ఎడ్లబండ్లు సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై సంబంధిత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించి మురుగునీరు ప్రవహించేలా రెండు పైపులైన్లు ఏర్పాటు చేసి, రోడ్డును పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

ఆలయ నిర్మాణానికి రూ.1.50 లక్షల విరాళం

జిన్నారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జిన్నారంలో నిర్మిస్తున్న జ్యోతిర్లింగ శివాలయానికి విరాళం అందజేయాలని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డిని మంగళవారం కలిశారు. దీంతో ఆయన ట్రస్టు తరఫున రూ.1.50 లక్షల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోజిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాజేందర్‌రెడ్డి, శ్రీకాంత్, ప్రభాకర్, హనీగుప్తా, రాము పాల్గొన్నారు.

మేధాశక్తిని పెంపొందించేందుకు రూమ్ టు రీడ్

సంగారెడ్డి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల మేధాశక్తిని పెంపొందించేందుకే రూం టు రీడ్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంఈవో భీంసింగ్ అన్నారు. రూం టు రీడ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కంకోల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోహీర్ ఎంఈవో జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

'ఎల్‌ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి'

రామచంద్రాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఎల్‌ఆర్ఎస్ పథకాన్ని ప్రజలు సద్వినియోగపర్చుకోవాలి తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి కోరారు. మున్సిపల్ పరిధిలో ఇప్పటి వరకు 12,728 దరఖాస్తులు వచ్చాయన్నారు. 6,688 దరఖాస్తులకు సంబంధించి ఎంత చెల్లించాలన్న వివరాలను అందించామన్నారు. ఈ నెల 31 వరకు ఎల్‌ఆర్ఎస్ చెల్లించిన వారికి 25 శాతం రాయతీ ఉంటుందన్నారు.

ఆరాధాన ఉత్సవాలు

మనోహరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సద్గురు ఆరాధన ఉత్సవాలు మండల కేంద్రంలోని కోనాయపల్లి గ్రామంలో సిద్దిపేట పీఠాధిపతి సద్గురు హకీం షరీఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ప్యాక్స్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, నత్తి మల్లేష్‌ముదిరాజ్, పంజా భిక్షపతి, భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్ నుంచి బయలుదేరిన పాదయాత్ర, రథయాత్ర

నారాయణఖేడ్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దత్తగిరిమహరాజ్ 46వ వార్షిక అమరతిథి సందర్భంగా కొనసాగుతున్న పాదయాత్ర, పల్లకీసేవ(రథయాత్ర) మంగళవారం మంగళవారం తెల్లవారుజామున రాయిపల్లి మార్గంలో బయలుదేరింది. ఈనెల 15న బర్దీపూర్ ఆశ్రమానికి చేరుకోనుంది. మంగళవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఖేడ్ దత్తగిరి ఆశ్రమాన్ని సందర్శించగా, దీంతో ఆశ్రమ బాధ్యులు సన్మానించారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన

పెద్దశంకరంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌరస్తా మీదుగా పాత సినిమా థియేటర్ వరకు రూ.80 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అభివృద్ధిలో మెదక్ నియోజకవర్గం ముందుంది

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



దర్పల్లి శివారు రహదారిపై బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

సంగారెడ్డి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గడిచిన సంవత్సర కాలంలో మెదక్ నియోజకవర్గం అభివృద్ధిలో ముందుందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని దర్పల్లి గ్రామ శివారు రహదారిపై ఎఫ్‌డీఆర్ నిధులు రూ.1.10 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. మెదక్ నియోజకవర్గం అభివృద్ధి ప్రారంభ దశ మొదలైందని, అసలైన అభివృద్ధి ముందుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దినెలలకే సీఎం రేవంతర్‌రెడ్డి మెదక్ జిల్లాకు వచ్చి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. 25 ఎకరాలలో (యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్) ఏర్పాటుకు రూ.200 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో మెదక్ అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ ఈఈ సర్దార్‌సింగ్, మాజీ ఎంపీపీ అరుణ, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచులు రాజిరెడ్డి, సుధాకర్, మాజీ ఎంపీటీసీ రామ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి: పద్మారెడ్డి



బోనంతో పద్మారెడ్డి

పాపన్నపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ముద్దాపూర్ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. పాపన్నపేట మండలం ముద్దాపూర్ గ్రామంలో ముత్యాల పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా మంగళవారం బోనాలు తీశారు. ఇందులో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి మహిళలతో కలిసి బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు.

ఎంపీ, ఎమ్మెల్యే నిర్లక్ష్యంతోనే ఆగిన మండల ఏర్పాటు

- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



మహాధర్నాలో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

కంగ్టి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్ల నిర్లక్ష్యం కారణంగానే తడ్కల్ మండలం ఏర్పాటులో తాత్సారం జరుగుతుందని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తడ్కల్‌లో మండల ఏర్పాటు కోసం నిర్వహించిన మహాధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. తడ్కల్‌ను ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలని గతంలో ఈ ప్రాంతవాసులు చేపట్టిన ఉద్యమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారన్నారు. బీఆర్ఎస్ పాలనలో మండలం ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ సైతం జారీచేయడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ ఇచ్చిన హామీ నెరవేర్చడం చేతకావడం లేదని ఆరోపించారు. ఈ ప్రాంత ప్రజలపై ఎమ్మెల్యేకు ఏ మాత్రం ప్రేమ ఉన్న తక్షణమే తడ్కల్‌ను మండలంగా ఏర్పాటుచేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లలితా అంజనేయులు, మాజీ ఎంపీపీ సంగీతావెంకట్‌రెడ్డి, అహ్మద్, సంతోష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫస్టియర్ పరీక్షకు 655 మంది గైర్హాజరు

సంగారెడ్డి అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఫస్టియర్ గణితం, బాటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 54 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. 20.555 మందికి 19.900 మంది హాజరుకాగా, 655 మంది గైర్హాజరయ్యారు. 96.81 హాజరు శాతం నమోదైందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు. కాగా శ్రీ అక్షయ, షాహీన్, ఎస్‌వీ, శ్రీ తేజ, రాయల్ జూనియర్ కళాశాల కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.

రూ.6 కోట్లతో సబ్‌స్టేషన్



రామచంద్రాపురం సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పరిశీలించిన కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం రామచంద్రాపురం తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో నిర్మితమవుతున్న విద్యుత్ ఉపకేంద్రం పనులు పరిశీలించి మాట్లాడారు. కాలనీల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విద్యుత్ వినియోగం పెరిగిందని చెప్పారు. ఇందుకు వీలుగా రూ.6కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈలు బాలకృష్ణ, తిరుపతమ్మ తదితరులు ఉన్నారు.

ఎస్పీ పరితోష్ పంకజ్‌కు శుభాకాంక్షలు

సంగారెడ్డి రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ఎస్పీగా పరితోష్ పంకజ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అఖిల్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీకి హెల్పింగ్ హ్యాండ్స్ అందిస్తున్న సేవలను వివరించగా యువతరం విద్యార్థి దశ నుంచే సామాజిక సేవలను అలవర్చుకుని పదిమందికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

డంపింగ్‌యార్డుతో అంతా కాలుష్యమయం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్



నర్సాపూర్‌లో దీక్షలో మార్వాడీలకు సంఘీభావంగా పాల్గొన్న మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నల్లవల్లి సమీపంలో అటవీ ప్రాంతానికి అనుకుని ఏర్పాటు చేయనున్న డంపింగ్‌యార్డు వల్ల అటవీ ప్రాంతంతో పాటు ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోతారని, వెంటనే డంపింగ్‌యార్డు ఏర్పాటును విరమించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం నర్సాపూర్‌లో నిర్వహిస్తున్న దీక్ష 22వ రోజుకు చేరుకున్నది. ఈ దీక్షలో స్థానిక మార్వాడీ వ్యాపారులు పాల్గొనగా.. వారికి మల్లేశ్‌గౌడ్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. డంపింగ్‌యార్డు వల్ల అటవీ ప్రాంతం పూర్తిగా కలుషితమవ్వడమే కాకుండా సమీప గ్రామాలతో పాటు నర్సాపూర్‌కు చెందిన చెరువుల్లో నీరు కలుషితమై పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోడరాజేందర్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమణారావు, ప్రముఖ వ్యాపారి శ్రీధర్‌గుప్తా, బీఆర్ఎస్ నాయకులు భిక్షపతి, జ్ఞానేశ్వర్, ముదిరాజ్ సంఘం నాయకుడు దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డుతో కాలుష్య ప్రభావం

రామచంద్రాపురం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేయదలిచిన డంపింగ్‌యార్డుతో 15 కిలో మీటర్ల మేరకు వాయు, జలకాలుష్య ప్రభావం ఉంటుందని ప్రజాసంఘాల పోరాట వేదిక కన్వీనర్ రాజయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం రామచంద్రాపురం కాలుష్య నియంత్రణ మండలి జోనల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, రాములు, రామిరెడ్డి, వెంకటేశ్వరరావు, సురేష్, రమణయ్య, వీరాస్వామి, జయరాం, నరేందర్ తదితరులు ఉన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం



సమావేశంలో నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి దామోదర్ రాజనర్సింహ, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు ఇరువురు స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నాయకులంతా కలిసికట్టుగా పనిచేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి మెదక్ కాంగ్రెస్ ఎంపీగా పోటీచేసిన నీలం మధుముదిరాజ్ హాజరయ్యారు.

రూ.55 లక్షలతో పాఠశాల గదుల నిర్మాణం

జిన్నారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం ప్రభుత్వ పాఠశాలలో సీఎస్ఆర్ నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. మంగళవారం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో న్యూలాండ్ పరిశ్రమ రూ.55 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించే అదనపు గదులకు శంకుస్థాపన చేశారు.

బొమ్మారెడ్డిగూడెం ఎక్సైజ్ అధికారికి రివార్డు



కమలహాసన్‌రెడ్డి నుంచి రివార్డును అందుకుంటున్న సీఐ గోపాల్

పుల్‌కల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గిరిజనతండాకు చెందిన ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జదావత్ గోపాల్ మంగళవారం రివార్డును అందుకున్నారు. తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలహాసన్‌రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్ నాంపల్లి ఎక్సైజ్ ప్రధాన కార్యాలయంలో ఈ రివార్డును అందుకున్నారు. 2017లో మెదక్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో పెద్దశంకరంపేట నుంచి రేగోడు వెళ్లే రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. రేగోడు మండలానికి చెందిన మునుగాల గంగాధర్ బైక్‌పై 4 కిలోల అల్ప్రాజోలంను తరలిస్తూ పట్టుబడ్డారు. అప్పట్లో గంగాధర్‌పై కేసు నమోదు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. 2023లో మెదక్ జిల్లా న్యాయాధికారి మునుగాల గంగాధర్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించినందుకుగానూ రివార్డు ప్రకటించారు. గోపాల్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని మలక్‌పేట ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ హరికిషన్, అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ కమిషనర్ ఖురేషీ పాల్గొన్నారు.

పచ్చదనానికి నిర్లక్ష్యపు మంట



మెదక్ కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా పిల్లికోటల్‌లోని మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఇరువైపులా వందలాది చెట్లు నాటారు. ఎవరో తెలియని వ్యక్తులు చెత్త కాల్చివేయాలని పెట్టిన మంట ఆర్పకుండా వదిలేయడంతో చెట్లకు అంటుకుని కాలిపోయాయి.

అందంగా.. ఆకర్షణీయంగా..



అత్యాధునిక హంగులతో ప్రభుత్వ బడి

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పోతిరెడ్డిపల్లిలోని జడ్పీహెచ్ఎస్‌ను సీఎస్ఆర్ కింద సుమారు రూ.40 లక్షలతో ఆధునీకరించారు. పాఠశాల తరగతి గదుల మరమ్మతులు, చుట్టూ ప్రహరీ, శౌచాలయాలు, భారీ స్టేజీతో పాటు రంగుల పెయింటింగ్స్, గోడలపై ప్రముఖుల చిత్రపటాలు వేసి సర్కారు బడిని అందంగా, ఆకర్షణీయంగా తయారు చేశారు. ఈనెల 12న (నేడు) ఈ పాఠశాలను కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రారంభించనున్నారని సంగారెడ్డి ఎంఈవో, పాఠశాల హెచ్.ఎం. విద్యాసాగర్ తెలిపారు.

- సంగారెడ్డి అర్బన్



తరగతి గదికి వెళ్లాలంటే.. గుండ్లు దాటాల్సిందే..!



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవరణలో భారీ బండరాళ్లు, గుండ్లు

నారాయణఖేడ్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఎంశ్రీ పథకానికి ఎంపికైంది. ఈ పథకం ద్వారా విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా గదులను నిర్మించడం కోసం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. నెలరోజుల పాటు తవ్వకాలు జరపడంతో భారీ బండరాళ్లు, గుండ్లు బయల్పాడ్డాయి. వాటిని పాఠశాల మధ్యలో వేయించారు. నెలరోజులుగా అవి అక్కడే ఉండడంతో విద్యార్థులు పాఠశాలకు భయంభయంగా వెళ్తున్నారు. ఈనెల 21 నుంచి పదో తరగతి పరీక్షలు కూడా పాఠశాలలో నిర్వహించనున్నారు. పాఠశాల మధ్యలో భారీ బండరాళ్లు, గుండ్లు ఉండడంతో విద్యార్థులు తరగతులకు వాటిని దాటుకుని వెళ్లాల్సి వస్తుంది. ఈ విషయమై పాఠశాల హెచ్ఎం మన్మథకిషోర్‌ను ప్రశ్నించగా, పనులు చేపట్టిన కాంట్రాక్టర్ వాటిని అలాగే వదిలేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు.

సీఎం.. మాట నిలబెట్టుకోవాలి : ఎంఎస్పీ

సంగారెడ్డి రూరల్/నారాయణఖేడ్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మాదిగలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్పీ) జిల్లా అధ్యక్షుడు అబ్రహం డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద మంగళవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా ఉద్యోగ నియామక ఫలితాలు ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత పూర్తయ్యేయ్య వరకు చేపట్టబోమని ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ రాష్ట్ర నాయకురాలు గీత, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్, జిల్లా గౌరవాధ్యక్షుడు అశోక్, నాయకులు పాల్గొన్నారు. అలాగే నారాయణఖేడ్‌లోని తహసీల్దార్ మైదానంలో ఎమ్మార్పీఎస్ డివిజన్ కన్వీనర్ అలిగే జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు.

పన్నుల వసూళ్లలో అవాంతరాలు

రామచంద్రాపురం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణాల అభివృద్ధిలో పన్నులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. విలీన గ్రామాల విషయంలో ఆన్‌లైన్ చేయడంలో జాప్యం జరిగింది. అధికారులకు విధించిన లక్ష్యం దెబ్బతీసింది. వాస్తవానికి 70శాతం వసూళ్లు చేసినా 11 శాతం మాత్రమే వసూలు చేసినట్టు రికార్డులో చూపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో తెల్లాపూర్, అమీన్‌పూర్ పురపాలికల్లో 11 గ్రామాలను విలీనం చేశారు. గతేడాది ఏప్రిల్‌లోనే పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. గతేడాది సెప్టెంబరులో మున్సిపాలిటీల్లోకి విలీనం చేసినట్టు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే స్వాధీన ప్రక్రియకు నోటిఫికేషన్ రావడానికి మధ్యలో ఆరునెలలు వసూలు చేసిన పన్నుల వివరాలు పురపాలక ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. ఈ విషయమై మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో చర్చ జరిగింది. తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో సైతం వివరాలు సేకరించారు.

పండరినాథ్‌రావుపటేల్ సేవలు చిరస్మరణీయం

- డీసీసీ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్‌రెడ్డి

నాగల్‌గిద్ద, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఇరక్‌పల్లి మాజీ సర్పంచ్ పండరినాథ్‌రావుపటేల్ గ్రామ అభివృద్ధితో పాటు కాంగ్రెస్‌కు చేసిన సేవలు చిరస్మరణీయమని డీసీసీ ప్రధాన కార్యదర్శి పీ.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పండరినాథ్‌రావుపటేల్ 25వ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ పార్టీ పటిష్ఠతకు పటేల్ విశేషంగా కృషిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు పీ.సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విఠల్‌రావుపటేల్, ఖేడ్ నాయక్ తహసీల్దార్ రాజుపటేల్, సతీష్‌పటేల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కోర్టు ఏర్పాటుకు ఎంపీపీ కార్యాలయం పరిశీలన

తూప్రాన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలో కోర్టు ఏర్పాటుకు జిల్లా న్యాయాధికారి లక్ష్మీశారద మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని పరిశీలించారు. తూప్రాన్ పట్టణానికి గత యేడాది జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ది ఫస్ట్ క్లాస్ కోర్టు మంజూరైంది. తూప్రాన్‌కు మంజూరైన కోర్టుకు గతేడాదిలో సిబ్బందిని మంజూరు చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీచేశారు. సరైన కోర్టు భవనం లభించకపోవడంతో ఏర్పాటు వాయిదా పడుతూ వచ్చింది. తూప్రాన్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కోర్టు ఏర్పాటుకు సిద్ధం చేయగా, మంగళవారం జిల్లా న్యాయాధికారి లక్ష్మీశారద పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ విజయలక్ష్మీ, సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ శివానందం, ఎంపీడీవో శేషాద్రి, ఆర్ఐ ప్రేమ్‌కుమార్, న్యాయవాదులు ఉన్నారు.

పాపన్నపేట ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా మోహన్‌రాజ్, భాస్కర్

పాపన్నపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సంస్థాన్ పాపన్నపేట ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాపన్నపేటకు చెందిన భట్టు మోహన్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల భాస్కర్, కోశాధికారిగా సంగమేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం పాపన్నపేట మంజీరా గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర నాయకుడు మిన్‌పూర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా శ్యాంసుందర్‌శర్మ, సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా శివచరణ్ సింగ్, దుర్గాప్రసాద్, సలహాదారులుగా నాగరాజు, మిన్‌పూర్ శ్రీనివాస్, నవాత్ బాలకిషన్, పి.సుమన్, అంతు నర్సింలు, కార్యవర్గ సభ్యులుగా బాలరాజ్, అంతు శ్రీనివాస్, జగదీష్, పి.శ్రీనివాస్, మల్లేశం ఎన్నికయ్యారు.